
సాక్షి
గుంటూరు
ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



శాశ్వత పరిష్కారం

ఇంద్రకీలాద్రి: దుర్గగుడి ఘాట్‌రోడ్డులో కొండ రాళ్లు జారిపడకుండా శాశ్వత చర్యలు చేపడుతున్నట్లు దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఎస్.సత్యనారాయణ పేర్కొన్నారు.



సాగు నీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం నీటి విడుదలను ఆపేశారు. బ్యాంక్ కెనాల్‌కు 492 క్యూసెక్కులు వదిలారు.



ఘాట్ రోడ్డు మూసివేత

ఇంద్రకీలాద్రి: దుర్గగుడి ఘాట్ రోడ్డును అధికారులు మూసివేశారు. శనివారం కొండ చరియలు విరిగిపడిన నేపథ్యంలో అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు.

న్యూస్‌రీల్

అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ సతీష్‌కుమార్



నగరంపాలెం: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సతీష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఇతర శాఖల అధికారుల సహకారం తీసుకుంటూ జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. జిల్లాలో పొంగే వాగులు, వంకల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. 0863–2234014 నంబరుకు ఫోన్ చేసి సమస్య తెలిపితే తక్షణ సహాయం పొందవచ్చని తెలిపారు. ప్రత్యేక కంట్రోల్ రూం 24 గంటలు పని చేస్తుందని ఆయన వెల్లడించారు.

ఇన్‌చార్జి డీసీహెచ్‌గా డాక్టర్ మజీదాబి

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్తగా తెనాలి జిల్లా ఆసుపత్రిలో సివిల్ సర్జన్ స్పెషలిస్టు (ఎనస్థీషియా) డాక్టర్ మజీదాబిని నియమిస్తూ శనివారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. డీసీహెచ్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సుబ్రహ్మణ్యంరాజు శనివారం పదవీ విరమణ చేశారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పలువురు వైద్యాధికారులు, సిబ్బంది ఆయన్ను సత్కరించి, సేవల్ని కొనియాడారు.

భారీ వర్షాల దృష్ట్యా రైల్వే హెల్ప్‌లైన్ ఏర్పాటు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే డివిజన్ పరిధిలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేసినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల కారణంగా అనేక రైళ్లను దారి మళ్లించడంతో పాటు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. వివరాలు తెలుసుకోవడానికి హెల్ప్‌లైన్ నంబర్లను (గుంటూరు రైల్వే స్టేషన్- 9701379072, నరసారావుపేట- 9701379978, నల్గొండ- 9030330121, మిరియాలగూడ- 8501978404, నంద్యాల- 7702772080, దొనకొండ- 7093745898, నడికుడి- 7989875492) సంప్రదించాలని ఆయన సూచించారు.

వాగులో వ్యక్తి గల్లంతు

గుంటూరు రూరల్: భారీ వర్షానికి మండలంలోని జొన్నలగడ్డ ప్రధాన రహదారిపై నాలుగు అడుగుల మేర వాగు ప్రవహించింది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళుతూ ప్రమాదవశాత్తూ వాగులో గల్లంతయ్యాడు. ఈ మేరకు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలికి చేరుకుని వెతికినా ఫలితం లేకుండా పోయిందని పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ ఆదాయానికి వర్షం పోటు

పట్నంబజారు: వాయుగుండం ప్రభావంతో ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షంతో ఆర్టీసీ ఆదాయానికి నష్టం వాటిల్లింది. గుంటూరు రీజియన్ పరిధిలోని గుంటూరు 1, 2 పొన్నూరు, తెనాలి, మంగళగిరి డిపోలకు సంబంధించి 369 బస్సులు ఉన్నాయి. వర్ష ప్రభావంతో ప్రయాణికుల రద్దీ తగ్గడంతో 180కి పైగా సర్వీస్‌లను నిలిపివేశారు. దీంతో రీజియన్ పరిధిలో శనివారం రూ. 35 లక్షల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

నకిలీ ఆభరణాలతో రూ.కోటి రుణం

తెనాలి: జాతీయ బ్యాంకులో విలీనమై, ఆ పేరుతో కొనసాగుతున్న మారీసుపేటలోని ఓ బ్యాంకు శాఖలో స్థానిక వ్యాపారి ఒకరు నకిలీ బంగారు ఆభరణాలు తనఖా పెట్టి కోటి రూపాయలకు పైగా రుణం తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. బ్యాంకు అధికారులు రెండు రోజుల కిందట ఈ విషయం గమనించారు. దీనిపై రహస్యంగా విచారణ చేస్తున్నారు. పట్టణానికి చెందిన ఒక వ్యాపారి కొంతకాలం కిందట ఈ బ్యాంకులో గృహ నిర్మాణం నిమిత్తం రుణం తీసుకున్నాడు. తర్వాత అతడికి వ్యాపారంలో నష్టం వచ్చింది. దీంతో రెండు నెలల కిందట అదే బ్యాంకులో నకిలీ ఆభరణాలు తాకట్టు పెట్టి తాను, కుటుంబ సభ్యుల పేరుతో కోటి రూపాయలకు పైగా రుణం తీసుకున్నాడని చెబుతున్నారు. సంబంధిత బ్యాంకు అప్రయిజరు, బ్యాంకు ఉద్యోగి పాత్ర కూడా ఇందులో ఉందని తెలుస్తోంది. రెండురోజుల క్రితం ఈ వ్యవహారాన్ని అధికారులు పసిగట్టారు. దీనిపై విచారణ జరుగుతోంది. వ్యాపారిని పిలిపించి ప్రశ్నించటంతో మరికొంత కాలం ఈ వ్యవహారాన్ని బహిర్గతం చేయకుండా ఉండాలని, అప్పటికి తాను రుణం మొత్తం చెల్లిస్తానని చెప్పాడట! అందుకోసం కొంత డబ్బు లంచం ఆశ చూపాడని చెబుతున్నారు. దీనిపై వివరణ కోరేందుకు సంబంధిత బ్యాంకు శాఖకు ఫోను చేస్తే లిఫ్ట్ చేయలేదు. బ్యాంకుకు వెళితే మేనేజరు లేరని సెక్యూరిటీ సిబ్బంది సమాధానం చెప్పారు.



మంగళగిరి మండలం కాజ టోల్‌ప్లాజా వద్ద నీటి ఉధృతిలోనే వాహనాల రాకపోకలు

అతలాకుతలం

జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు

- ఉప్పలపాడు వద్ద కారు వాగులో కొట్టుకుపోయి ముగ్గురు మృతి
- కొండచరియలు విరిగిపడి ఒకరి మృతి
- లాం వాగులో ఒకరు గల్లంతు, ఇద్దరు సురక్షితం
- పొంగుతున్న వాగులు
- నీట మునిగిన రాజధాని

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లాను కుండపోత వాన ముంచెత్తింది. ఆకాశానికి చిల్లుపడిందా? మేఘ విస్ఫోటనం జరిగిందా? అన్నట్లుగా ఆగకుండా వర్షం కురిసింది. శనివారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలలోపు కేవలం పది గంటల సమయంలోనే 15 నుంచి 28 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ మధ్య కాలంలో ఇంతటి వర్ష బీభత్సాన్ని చూడలేదు.

స్తంభించిన జన జీవనం

అల్పపీడన ప్రభావంతో శుక్రవారం ఉదయం నుంచి ఆగకుండా కురుస్తున్న వర్షాలకు గుంటూరు జిల్లాలో జనజీవనం స్తంభించింది. వర్షం దాటికి రోడ్లు, ఇళ్లు జలాశయాలుగా మారిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో రాత్రి వరకూ కూడా పలు ప్రాంతాలు అంధకారంలోనే ఉన్నాయి. 24 గంటల సమయంలో 250 నుంచి 399 మిలీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. వాపార, వాణిజ్య కార్యకలాపాలు మూతపడ్డాయి. చిరువ్యాపారులు, తోపుడు బండ్ల వారు ఇంటికే పరిమితం అయ్యారు. జిల్లా వ్యాప్తంగా స్కూళ్లకు సెలవులు ప్రకటించారు

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

కలకత్తా–చెన్నై రహదారిపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. కాజా టోల్‌గేట్ వద్ద మూడు అడుగుల మేర వరద ప్రవాహం నిలవడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. రాత్రి తొమ్మిది గంటల సమయానికి కూడా అక్కడ పరిస్థితి అదుపులోకి రాలేదు. ప్రజలకు రోడ్లపైకి రావద్దంటూ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు శక్తివంచన లేకుండా పనిచేశారు. సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో పలు రైళ్లను రద్దు చేశారు. గుంటూరు రీజియన్ పరిధిలో 180కి పైగా సర్వీస్‌లను నిలిపివేశారు. వర్షాల ప్రభావం వల్ల ఇబ్బందులు తలెత్తితే స్పందించేందుకు గుంటూరు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.

సహాయక శిబిరాల ఏర్పాటు

గుంటూరు నగరంలో పొన్నూరు రోడ్డు ఆంధ్ర ముస్లిం కాలేజీ, పాత గుంటూరు యాదవ హైస్కూల్, లీలా మహల్ దగ్గర ఉన్న ప్రభుత్వ హైస్కూల్, పొన్నూరు రోడ్డు అంజుమన్ స్కూల్, ఇశ్రాయేల్ పేట బొర్రా నాగేశ్వరరావు స్కూల్, నందివెలుగురోడ్డు వినోభానగర్ స్కూల్, సంజీవయ్య నగర్ పి.ప్రభుదాస్ హైస్కూళ్లలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సహాయక శిబిరాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే తాడేపల్లి, మంగళగిరి, పెదకాకాని, ప్రత్తిపాడు, దుగ్గిరాల మండలాలలో



పెదకాకాని సుందరయ్య కాలనీ నుంచి పునరావాస కేంద్రాలకు తరలి వెళుతున్న బాధితులు

లోతట్టు ప్రాంతాలోని దాదాపు 500 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. మంగళగిరిలో నిడమర్రు చెరువు తెగి టిడ్కో ఇళ్లు నీట మునిగాయి. తాడేపల్లి కనకదుర్గ వారధి, రేపల్లె రహదారిలో కరకట్ట వెంబడి రెండువైపులా ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. తాడేపల్లి పట్టణ పరిధిలోని కృష్ణనగర్, జగ్జీవన్‌రామ్ కాలనీ, ఎర్ర క్వారీ, తెల్లక్వారీతో పాటు నులకపేట చెరువు వెనుక భాగంలో రోడ్లు జలమయమై ఇళ్లలోకి వర్షపునీరు చొరబడింది.

గండ్లతో కడగండ్లు

- ✦ గుంటూరు చానల్‌కు మూడు చోట్ల, అప్పారావు చానల్‌కు ఒకచోట గండి పడటంతో వందలాది ఎకరాలు నీట మునిగాయి. జిల్లాలో పలు పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి.
- ✦ కొండవీటి వాగు ఉప్పొంగింది. రాజధాని చుట్టూ వరద నీరు చేరడంతో హైకోర్టుకు వెళ్లే ప్రధాన రహదారి నీటితో నిండిపోయింది. ఎస్ఆర్ఎం, విట్ యూనివర్సిటీలతో పలు రాజధాని నివాస భవనాలు, లోతట్టు ప్రాంతాలు రోడ్లు నీటితో నిండిపోయాయి.

విరిగిపడిన కొండ చరియలు

పెదకాకాని మండలం ఉప్పలపాడు వద్ద వర్షం దాటికి పక్కనే ఉన్న వాగులోకి కారు కొట్టుకుపోయిన సంఘటనలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. నంబూరులోని ప్రైవేటు విద్యాసంస్థలో లెక్కల మాస్టార్‌గా పనిచేస్తున్న నడుంపల్లి రాఘవేంద్రరావు(39) మధ్యాహ్నం స్కూల్ నుంచి బయలుదేరుతూ తనతోపాటు తన ఊరికి చెందిన పసుపులేని సాదీస్ (6), కోడూరి మాన్విత్(9)ని కూడా కారులో ఎక్కించుకున్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురూ మరణించారు.

- ➡ భారీ వర్షాలు, ఈదురుగాలులలో మంగళగిరి, తాడేపల్లిలో కొండచరియలు విరిగిపడ్డాయి. మంగళగిరి కొత్తపేటలో రూకా నాగరత్నమ్మ(85) భోజనం సమయంలో వంటగదిలోకి వెల్లగా కొండ రాయి తల మీద పడడంతో గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ నలుగురి కుటుంబాలకు ఒక్కొక్కరికి ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ప్రకటించారు.
- ➡ తాడేపల్లి పట్టణ పరిధిలో సీతానగరం, పోలకంపాడు ప్రాంతాల్లో ఐదు చోట్ల కొండ చరియలు విరిగి పడ్డాయి. తాడేపల్లి క్రిస్టియన్ పేట సచివాలయం ఎదురుగా కొండ చరియలు జారి ఒక ఇంటి ప్రహరీగోడ ధ్వంసమైంది.
- ➡ సీతానగరం బోటు యార్డు దగ్గర నుంచి కృష్ణా నది పుష్కర ఘాట్‌లకు వెళ్లే మార్గంలో కొండచరియలు జారి స్వల్పంగా నివాసాలు దెబ్బతిన్నాయి.
- ➡ పోలకంపాడులో మరో మూడు చోట్ల కొండ చరియలు జారి ఒక ఇంటి పైకప్పు పగలగా, మరో బిల్డింగ్ గోడ పూర్తిగా ధ్వంసమైంది.
- ➡ జొన్నలగడ్డ గ్రామంలో రహదారిపై వాగు పొంగడంతో గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళుతూ ప్రమాదవశాత్తూ వాగులో గల్లంతయ్యాడని స్థానికులు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని వెతికినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు.

కొండవీటి వాగు ఉప్పొంగడంతో తాడికొండ మండలం లాం గ్రామం వద్ద అమరావతి- గుంటూరు ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు చేరింది. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది.

- ✦ పెదపరిమి వద్ద కోటేళ్ల వాగు పొంగి రాజధానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి సంబంధాలు తెగిపోయాయి. నెక్కల్లు వద్ద వాగులో ఆటో గల్లంతైంది. ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ ట్రాక్టరుపై వెళ్లి తాడు సాయంతో ముగ్గురుని బయటకు లాగారు.
- ✦ నాగార్జునా యూనివర్సిటీ లైబ్రరీలోకి కూడా రెండు అడుగుల మేర వర్షపు నీరు చేరింది. మరోవైపు ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు 3,40,950 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదులుతున్నారు.
- ✦ చేబ్రోలులోని అప్పాపురం చానల్‌కు గండి పడింది. నీరు పొలాల్లోకి, సమీపంలోని ఇళ్లలోనికి ప్రవేశించింది.
- ✦ పాతరెడ్డిపాలెం గ్రామం నుంచి లేమల్లపాడు గ్రామంలోకి వెళ్లే దారిలోని వంతెన సమీపంలో బలహీనంగా ఉన్న చానల్ కట్టల వద్ద గండి పడింది. నీరు పొలాల్లోకి, దళితవాడ ప్రాంతాల్లోని ఇళ్లలోకి చేరింది.
- ✦ మేడికొండూరు మండలం కొర్రపాడు గ్రామంలో పక్కనే ఉన్న వాగు పొంగి పొర్లడంతో ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. గ్రామస్తులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు.
- ✦ పొలడుగు గ్రామంలో వాగు ఉధృతికి జగనన్న కాలనీలో నీరు చేరింది. ఏడుగురిని సత్తెనపల్లి అగ్నిమాపక సిబ్బంది కాపాడారు.
- ✦ విశదల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న వాగు పొంగి పొర్లడంతో రాకపోకలు నిలిచాయి.
- ✦ ప్రత్తిపాడు - పెదగొట్టిపాడు మధ్యనున్న లోలెవల్ చప్టాపై నక్కల వాగు ఉప్పొంగింది. వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించడంతో పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం బోయపాలెం, ఉన్నవ,



చినకోండ్రుపాడు- నడింపాలెం మధ్య ప్రమాదకరంగా ఉప్పొంగుతున్న రామవాగు

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండల పరిధిలోని పరిధిలోని గొట్టిపాడు ప్రత్తిపాడు, గనికపూడి, పెదనందిపాడు మండలం కొప్పర్రు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

- ✦ గొట్టిపాడు- గనికపూడి మధ్యనున్న లోలెవల్ చప్టాపై కొండవాగు ఉప్పొంగడంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.
- ✦ చినకోండ్రుపాడు నుండి నడింపాలెం వెళ్లే దారిలో ఉన్న లోలెవల్ చప్టాపై రామవాగు ఉప్పొంగింది. నీటి ఉధృతి పెరగడంతో చప్టా పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.
- ✦ వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడులో వాగులు ఉప్పొంగి రోడ్లను ముంచెత్తాయి.
- ✦ నల్లపాడు గ్రామంలోని సత్తెనపల్లి, గుంటూరు ప్రధాన రహదారి నీటమునిగి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.
- ✦ లాలుపురం గ్రామంలోని 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నీట మునిగింది.



వర్షపు నీటితో నీటమునిగిన గుంటూరు బస్టాండు



బేతపూడి వద్ద బ్రిడ్జి మీదుగా ప్రవహిస్తున్న నీరు



గుంటూరు నగరంలోని ఓ ఇంట్లోకి చేరిన నీరు



తాడేపల్లిలో వర్షపు నీటిలో కుటుంబం



తెనాలి సమీపంలో చెరువులుగా కనిపిస్తున్న చేలు

వర్షాలకు అప్రమత్తంగా అధికార యంత్రాంగం

– మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి: రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసేందుకు ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉందని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఎక్కడికక్కడ అవసరమైన సహాయ చర్యలు కూడా చేపట్టినట్టు తెలిపారు. జలమయమైన పట్టణ బోసురోడ్డును, చిట్టి ఆంజనేయ స్వామి గుడి దగ్గర్లోని డ్రెయినేజీ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర మంత్రులు, జిల్లా కలెక్టర్లు, క్షేత్రస్థాయి అధికారుల సహా ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉంటూ సహాయక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజలకు ఇబ్బంది లేకుండా మున్సిపల్, ఆరోగ్య విభాగం అధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఆ శాఖ అధికారులు రంగంలో ఉన్నారని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని వారిని సురక్షిత శిబిరాల్లో ఉంచినట్టు తెలిపారు. వర్షం ఉధృతి తగ్గిన తర్వాత డ్రైనేజీ పనులు వేగంగా చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకుంటారని చెప్పారు. మంత్రి వెంట కమిషనర్ బి. శేషన్న, ఆరోగ్య, పారిశుధ్య విభాగం అధికారులు ఉన్నారు.



వర్షపు నీటిని బయటకు పంపే పనులపై సూచనలిస్తున్న మంత్రి మనోహర్

శలపాడులో కూలిన పూరిల్లు

శలపాడు(చేబ్రోలు): ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చేబ్రోలు మండలం శలపాడులో శనివారం పూరిల్లు కూలిపోయింది. గ్రామానికి చెందిన యేమినేని మునెమ్మ స్థానిక పైపుల రోడ్డులో ఓ పూరింటిలో భర్త చనిపోవడంతో ఒంటరిగా నివసిస్తోంది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి పూరింటి గోడలు నాని రెండు వైపులా కూలిపోయాయి. ప్రమాద సమయంలో మునెమ్మ ఇంటిలోనే ఉంది. గోడలు బయటకు పడకుండా లోపలి వైపునకు పడి ఉంటే ప్రాణనష్టం జరిగి ఉండేది. త్రుటిలో పెను ప్రమాదం తప్పడంతో స్థానికులు, బంధువులు ఊపిరి పీల్చుకున్నారు.



ప్రజలకు ఇబ్బంది లేకుండా పటిష్ట చర్యలు

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శనివారం రాత్రి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. శుక్ర, శనివారాల్లో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో గ్రామాలతోపాటు, పట్టణాల్లో వర్షపు నీరు నిలిచిపోయిందని తెలిపారు. పొన్నూరు నియోజకవర్గం, పెదకాకాని మండలం ఉప్పలపాడు వాగులోకి కారు కొట్టుకుపోయి రాఘవేంద్రరావు (38), పి.సాదీష్ (8), కె.మణిదీప్ (9) మృతి చెందారన్నారు. మంగళగిరిలోని కొత్తపేటలో కొండ చరియలు విరిగి రుక్కా నాగరత్తమ్మ (88) మృతి చెందారని తెలిపారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం తరఫున ప్రకటించినట్లు చెప్పారు. జిల్లాలో లోతట్టు ప్రాంతాల్లో ఉన్నవారిని పునరావాస కేంద్రాలకు తరలించి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే తాడేపల్లి, మంగళగిరి, పెదకాకాని, ప్రత్తిపాడు, దుగ్గిరాల మండలాల్లో లోతట్టు ప్రాంతాల నుంచి దాదాపు 500 మందిని పునరావాస కేంద్రాలకు తరలించినట్లు చెప్పారు. గుంటూరులోని నగరపాలక సంస్థలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. జాతీయ రహదారి కాజా టోల్‌ప్లాజా వద్ద వర్షపు నీటిని అధికారులు డ్రెయినేజీలోకి మళ్లించి రాకపోకలను పునరుద్ధరించినట్లు వెల్లడించారు. గుంటూరులోని అన్ని తహసీల్దారు కార్యాలయాల్లో 24 గంటలూ పనిచేసే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని కలెక్టర్ చెప్పారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సరఫరా చేసే మంచినీటిని పూర్తి స్థాయిలో పరీక్షించి సరఫరా చేస్తున్నామని, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని అందుబాటులో ఉంచామని తెలిపారు. కొల్లిపర, దుగ్గిరాల, తాడేపల్లి, తుళ్లూరు, మంగళగిరి, ప్రత్తిపాడు మండలాల్లోని 16 వరద ప్రభావిత గ్రామాల్లో పారిశుద్ధ్యం నిరంతరం సమీక్షిస్తున్నామని చెప్పారు. విద్యుత్ స్తంభాలతోపాటు, సరఫరాను కూడా ఎప్పటికప్పుడు పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. వర్షాల వల్ల ఇబ్బంది కలిగితే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నంబరు 0863-2234014, 9849904013కి ప్రజలు కాల్ చేసి సహాయం పొందవచ్చని సూచించారు. ప్రజలు అధైర్యపడొద్దని, ప్రభుత్వ యంత్రాంగం అన్ని వేళలా సహాయంగా ఉంటుందని కలెక్టర్ భరోసా కల్పించారు.

ముగ్గురిని మింగేసిన వరద

- వాగులో కొట్టుకుపోయిన కారు
- ఉపాధ్యాయుడు, ఇద్దరు విద్యార్థుల మృతి



తల్లిదండ్రులతో కోడూరి మాన్విక్ (ఫైల్)



పసులేటి సారీస్ (ఫైల్)



రాఘవేంద్ర (ఫైల్)

పెదకాకాని: మండలంలోని ఉప్పలపాడులో ఉపాధ్యాయుడు, ఇద్దరు విద్యార్థులను వరద మింగింది. అందులో ఇద్దరు చిన్నారులు కాగా, మరొకరు వారికి చదువు చెప్పే ఉపాధ్యాయుడు. రెండు నిమిషాల్లో ఇంటికి చేరొచ్చని, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును తప్పించుకోబోయి మృత్యువు ఒడిలోకి చేరుకున్నారు. పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామ శివారులోని వాగు వద్ద శనివారం ఈ సంఘటన చూసిన వారి హృదయాలను కలిచివేసింది. ఘటన వివరాలు ఇలా ఉన్నాయి... మంగళగిరి రూరల్ మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన నడింపల్లి రాఘవేంద్ర(40) నంబూరు సమీపంలోని వివా స్కూల్లో ఉపాధ్యాయగా పని చేస్తున్నారు. స్కూలుకి దగ్గరగా ఉండటంతో ఇటీవల ఆయన నివాసాన్ని ఎర్రబాలెం నుంచి ఉప్పలపాడుకు మార్చారు. రోజు వివా స్కూల్‌కి వెళ్లొస్తుంటారు. అదే గ్రామానికి చెందిన కోడూరి మాన్విక్(9), పసుపులేటి సారిస్(8) అనే చిన్నారులు వివా స్కూల్లో ఒకరు 4వ తరగతి, మరొకరు 2వ తరగతి చదువుతున్నారు. ప్రతి రోజూ స్కూల్‌కి వెళ్లి తిరిగి ఉప్పలపాడు గ్రామానికి వస్తుంటారు. ఈ క్రమంలో శనివారం విద్యార్థులు పాఠశాలకు చేరుకున్నారు. భారీ వర్షం కురవడంతో సెలవు ఇచ్చారు. ఉపాధ్యాయుడు రాఘవేంద్ర కారులో ఇంటికి వెళుతుండగా, ఇద్దరు చిన్నారులు కూడా ఎక్కారు. ఉప్పలపాడు గ్రామ శివారులోని వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద నీటి ప్రవాహ ఉధృతిని అంచనా వేయలేక ఉపాధ్యాయుడు రాఘవేంద్ర కారుని నీటిలో ముందుకుపోనిచ్చాడు. ప్రవాహానికి పక్కనే ఉన్న డ్రైన్‌లో పడి 50 మీటర్ల దూరం కొట్టుకుపోయింది. డ్రైవర్ సీట్‌లో ఉన్న ఉపాధ్యాయుడు రాఘవేంద్ర, విద్యార్థులు కోడూరి మాన్విక్, పసుపులేటి సారిస్ నీట మునిగి ఊపిరి ఆడక మృతి చెందారు. గమనించిన స్థానికులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కారును తాడు కట్టి బయటికి లాగి, అద్దాలు పగలగొట్టి అందులో ఉన్న వారిని బయటికి తీశారు. అప్పటికే ముగ్గురు మృతి చెంది ఉన్నారు.



నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన కారు

చిన్నారుల మృతి బాధాకరం

ఉప్పలపాడు గ్రామ శివారు వాగులో కారు ప్రమాదం ఘటనలో ముగ్గురు మృతి చెందిన వార్త దిగ్భ్రాంతికి గురిచేసిందని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ , పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర అన్నారు. మృతులు పసుపులేటి సారిష్, కోడూరి మాన్విక్, నడింపల్లి రాఘవేంద్రకు నివాళులు అర్పించారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు.

క్లుప్తంగా

పర్యావరణవేత్తగా విజయ్‌కుమార్ సేవలు ప్రశంసనీయం



కొరిటిపాడు(గుంటూరు): పర్యావరణవేత్తగా, ప్రకృతి వ్యవసాయం ద్వారా వాతావరణ మార్పుల తీవ్రత తగ్గించడం కోసం రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు టి.విజయ్ కుమార్ అహరహం శ్రమిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ కొనియాడారు. ఆయన ఏపీసీఎన్ఎఫ్(ఆంధ్ర ప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం)ప్రతిష్టాత్మక "గుల్బెంకియన్ ప్రైజ్ ఫర్ హ్యూమానిటి 2024 "గ్లోబల్ అవార్డుకు ఎంపికైన సందర్భాన్ని పురస్కరించుకొని గుంటూరుకు చెందిన బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఓ హోటల్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఉపాధ్యక్షులు, ఇండియన్ టొబాకో అసోసియేషన్ అధ్యక్షులు పోలిశెట్టి శ్యాంసుందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజశేఖర్ మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయాన్ని ఉద్భవిస్తున్న సైన్స్‌గా అభివర్ధిస్తూ ప్రధాన వ్యవసాయ విధానంలోకి తీసుకొచ్చే ప్రయత్నాన్ని విజయ్ కుమార్ చేస్తున్నారని కొనియాడారు. 117 దేశాల నుంచి వచ్చిన 181 నామినేషన్‌లలో ఏపీసీఎన్ఎఫ్‌కు గుల్బెంకియన్ ప్రైజ్ మనీ దక్కడం వెనుక ఎంతో కృషి దాగి ఉందని వెల్లడించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల రైతులు మాత్రమే నష్టపోవడం లేదని, ఆహారంలో పోషకాలు తగ్గడం వల్ల అనారోగ్యాలకు గురి కావలసి వస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా పోర్చుగల్ దేశంలోని లిస్బన్ నగరంలో జులై 2024 లో జరిగిన "గుల్బెంకియన్ ప్రైజ్ ఫర్ హ్యూమానిటి 2024 "అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని వీడియో ద్వారా ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐటీసీ లీఫ్ ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ కె.కృష్ణ కుమార్, ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, రైతు సాధికార సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి. రామారావు పాల్గొన్నారు.

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న యువకుడి అరెస్ట్



తెనాలి రూరల్: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న యువకుడిని జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేశారు. తెనాలి జీఆర్పీ స్టేషన్‌లో శనివారం వివరాలను ఎస్ఐ వెంకటాద్రి వెల్లడించారు. మార్చి 26న జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికురాలు ఉషాకుమారి బ్యాగ్ అపహరణకు గురైంది. ఈ నెల 25న లింగంపల్లి-నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో మరో ప్రయాణికురాలి ల్యాప్ టాప్, బ్యాగ్ అపహరణకు గురవ్వగా గుడివాడ జీఆర్పీ స్టేషనులో కేసు నమోదైంది. కేసులను విచారించిన పోలీసులు నిందితుడిని తెనాలి యడ్ల లింగయ్య కాలనీకి చెందిన గాజుల సురేష్ అలియాస్ చిన్నిగా గుర్తించారు. అతడ్ని అదుపులోకి తీసుకుని బ్యాగులు, వాటిల్లోని ఏటీఎం కార్డులు, ల్యాప్ టాప్, పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకున్నారు.



ప్రత్తిపాడులో నీట మునిగిన ఇల్లు



మంగళగిరిలో కొండచరియ విరిగిపడి ఇంట్లోకి వచ్చిన రాళ్లు



లాం వద్ద అమరావతి- గుంటూరు ప్రధాన రహదారిపై వాగు ఉధృతి

వర్ష బీభత్సం

- 400 కుటుంబాలు పునరావాస కేంద్రాలకు తరలింపు
- గుంటూరు చానల్‌కు మూడుచోట్ల గండి
- చెరువును తలపిస్తున్న పంట పొలాలు
- జలదిగ్బంధంలో నంబూరు, గోళ్లమూడి గ్రామాలు

పెదకాకాని: తుఫాన్ బీభత్సానికి జిల్లా ప్రజలు విలవిలలాడారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి రోడ్లు, కాలువలు, చెరువులు జలమయమయ్యాయి. గుంటూరు చానల్‌కు నంబూరు, పెదకాకాని సమీపంలో మూడు చోట్ల గండి పడడంతో నీరు పెద్ద మొత్తంలో పొలాలకు చేరింది. దీంతో పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. నంబూరు, గోళ్లమూడి గ్రామాలు జలదిగ్బంధంలో చుట్టుకున్నాయి. గ్రామాల్లో కూడా పల్లపు ప్రాంతాల్లో ఇళ్ల చుట్టూ నీరు చేరింది. ప్రజలు బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. పెదకాకాని మంచినీటి చెరువుకు పక్కనే ఉన్న వడ్డెర కాలనీ చెరువు, మురుగు చెరువుకు గండిపడి మూడు చెరువులు ఏకమయ్యాయి. పల్లాలమ్మ చెరువుకు పెద్ద మొత్తంలో వర్షపు నీరు చేరడంతో పక్కనే ఉన్న సుందరయ్య కాలనీ నీట మునిగింది. సుమారు 300 కుటుంబాలు పిల్లపాపలతో రోడ్డుపైకి చేరారు. కాలనీలోకి వెళ్లే ప్రధాన రోడ్డుపై కూడా వర్షపు నీరు చేరడంతో అధికారులు అ ప్రాంతానికి చేరుకుని నిరాశ్రయులైన బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. బాజీ బాబా దర్గా చుట్టుపక్కల వర్షపు నీరు చేరడంతో ఆప్రాంతంలో నివాసం ఉంటున్న వంద కుటుంబాలను లూథర్‌గిరికాలనీ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. పెదకాకాని పోలీసు స్టేషన్, గడ్డిపాడు ప్రాంతాల్లో ఉన్న చెరువులకు భారీగా నీరు చేరింది. ఈదురు గాలులకు చెట్లు కూలి విద్యుత్ సరఫరా, సెల్‌టవర్లు దెబ్బతిన్నాయి. రాత్రంతా అంధకారంలోనే పెదకాకాని మండల ప్రజలు గడిపారు.



ఏఎన్‌యూలో మోకాళ్లకు పైగా నీటిలో పుస్తకాలు సర్దుకుంటున్న ఉద్యోగులు

నీటిమయమైన యూనివర్సిటీ ప్రాంగణం

ఏఎన్‌యూ: భారీ వర్షాలతో యూనివర్సిటీ ప్రాంగణం నీటి మయమైంది. అంబేద్కర్ లైబ్రరీ, బాలుర వసతి గృహాలతోపాటు పలు కార్యాలయాల్లోకి వర్షపు నీరు భారీగా చేరింది. గదుల్లోని విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలు, వస్తువులు బయటకు కొట్టుకువచ్చాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లోని గదులన్నింటిలో వర్షపునీరు చేయడంతో విద్యార్థులు తమ వస్తువులను మంచాలపై వేసుకున్నారు. కొన్ని గదుల్లో అయితే మంచాలకంటే ఎత్తుకు వర్షపు నీరు చేరింది. దీంతో విద్యార్థుల వస్తువులన్నీ నీటిలో తడిచి ముద్దయ్యాయి.

పరిపాలనా భవన్, హెల్త్ సెంటర్ ప్రాంతం నుంచి వర్షపు నీరు ప్రవహించి లైబ్రరీ ప్రాంగణానికి చేరింది. దీంతో వర్షపు నీటితో లైబ్రరీ రిఫరెన్స్ సెక్షన్ చెరువులా మారింది. వర్షపు నీరు, మురుగు నీరు ప్రవహించేందుకు మార్గం లేకపోవడం వల్లనే ఈ పరిస్థితి నెలకొందని సిబ్బంది, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షం పడటంతో శనివారం మధ్యాహ్నం నుంచి యూనివర్సిటీ కార్యాలయాలు, కళాశాలలకు అధికారులు సెలవు ప్రకటించారు. విధుల నుంచి తిరిగి వెళ్లేటప్పుడు కాజ టోల్ గేట్ ప్రాంగణంలో వర్షపు నీరు భారీగా చేరడంతో కొందరు ఉద్యోగులు ఇళ్లకు వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు.



గుంటూరు నగరంలో నీట మునిగిన ఇంట్లో వృద్ధుడు



గుంటూరు నగరంలో ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు

లీజుపై కౌన్సిల్ సైలెన్స్



మేయర్‌కు డిసెంట్ నోట్‌ను అందిస్తున్న డెప్యూటీ మేయర్ డైమండ్ బాబు

- బాలకుటీర్ లీజు పొడిగింపుపై ప్రతిష్టంభన
- ఎటు తేల్చని సభ్యులు
- తిరస్కరణ లేదు, ఆమోదం లేదు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు శ్యామలానగర్‌లోని శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్ లీజు పొడిగింపుపై కౌన్సిల్‌లో ప్రతిష్టంభన నెలకొంది. స్థలం నగరపాలక సంస్థకు చెందినది కావడంతో లీజు పొడిగింపునకు నిబంధనలు వర్తిస్తాయని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్‌వాల్యూ, విద్యార్థుల భవిష్యత్తు, కోర్టు తీర్పులు, సభ్యుల లెవనెత్తిన అంశాలతో కలిపి పూర్తి నివేదికను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. దీన్ని కౌన్సిల్ అమోదించడం గానీ తిరస్కరించడం గానీ చేయడంలేదని, ప్రభుత్వమే తగిన చర్యలు తీసుకుంటుందని ఆయన వివరించారు. నగర మేయర్ కావటి అధ్యక్షతన శనివారం నగరపాలక సంస్థ ప్రత్యేక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీలు కె.ఎస్. లక్ష్మణరావు, చంద్రగిరి ఏసురత్నం, తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీల హాజరయ్యారు.

కౌన్సిల్‌లో వాడీవేడి చర్చ

బాలకుటీర్ లీజు వచ్చే నెలతో ముగియనుండటంతో మరోసారి పొడిగించే అంశంపై కౌన్సిల్‌లో వాడీవేడి చర్చ జరిగింది.

- ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ పేద విద్యార్థులకు కొన్ని సీట్లు ఉచితంగా ఇవ్వాలని కోరారు. కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీని స్కూలు తీసుకుని సేవ చేసే విధంగా నిబంధనలు పెట్టి లీజు పొడిగించాలని కోరారు.
- గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు దృష్ట్యా 50 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన బాలకుటీర్ స్కూల్ లీజు పొడిగింపుపై కౌన్సిల్ ఏకగ్రీవం తీర్మానం చేయడం శ్రేయస్కరమని తెలిపారు.
- తూర్పు ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ బాలకుటీర్ లీజు పొడిగింపు విషయానికి ముందుకు ఎగ్జిక్యూటివ్ అథారిటీ ఈ అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఆ తరువాత న్యాయ సలహాలు తీసుకుని దీనికి ఆమోదం తెలపడం ఉత్తమమని అభిప్రాయపడ్డారు.
- ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలు అమలు చేయరని ఆరోపించారు. ముఖ్యంగా పేద విద్యార్థులకు ఉచితంగా సీట్లు ఇవ్వాలని చెప్పినప్పటికీ ఇవ్వడం లేదని తెలిపారు. 25 ఏళ్ల లీజు వ్యవహారం కాబట్టి ఒకసారి ఆలోచించాలని, ఒకసారి ఆమోదం పొందితే తరువాత చేసేది ఏమీ ఉండదు కాబట్టి న్యాయసలహా తీసుకోవాలని సూచించారు.
- డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్ లీజు పొడిగింపు కౌన్సిల్ చేసే అవకాశం లేదని, ఇలాంటి విషయాల్లో సీఎం, ప్రధానికి కూడా తగిన అధికారాలు లేవని తెలిపారు. సుప్రీం కోర్టు దీనిపై స్పష్టమైన జడ్జిమెంట్ ఇచ్చిందని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో 25 ఏళ్ల లీజు పూర్తయిన షాపులను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు... బాలకుటీర్ విషయంలో 50 ఏళ్లు గడిచినా ఎందుకు స్వాధీనం చేసులేకపోతున్నారని ప్రశ్నించారు. షాపు లీజుదారులకు ఒక న్యాయం, బాలకుటీర్ వాళ్లకి ఒక న్యాయమా ? అని ప్రశ్నించారు. లీజు పొడిగించే అధికారం కౌన్సిల్‌కు లేదని.. ఆ విధంగా చేస్తే డిసాల్వ్ అయ్యే పరిస్థితి ఉందన్నారు. లీజు పొడిగింపుపై తనకు అభ్యంతరాలు ఉన్నాయని, వాటికి సంబంధించిన పూర్తి వివరాలతో నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడుకి, కౌన్సిల్ సెక్రటరీ సీహెచ్. శ్రీనివాస్‌కు తగిన అధారాలతో డిసెంట్ నోట్ అందించారు. ఈ అంశంపై అధికారులు తమ స్టాండ్ ఏమిటో ఇప్పటికీ చెప్పడం లేదని, న్యాయ సలహా తీసుకుని ముందుకు వెళ్లడం మంచిదని సూచించారు.
- తెలుగుదేశం కార్పొరేటర్లు స్కూల్‌కు అనుకూలంగా మాట్లాడారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు సీట్లు ఇవ్వాలి

బాలకుటీర్‌లో కేవలం అగ్ర కులాలలకు చెందిన వారికే సీట్లు కేటాయిస్తారని కార్పొరేటర్లు రామనబోయిన అజయ్, పూనూరి నాగేశ్వరరావు, మల్లవరపు రమ్య, సంకూరి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఆశించిన స్థాయిలో సీట్లు దొరకవని విమర్శించారు. ప్రభుత్వ స్థలం కాబట్టి కొన్ని సీట్లు ఉచితంగా ఇవ్వాలని నిబంధనల చెబుతున్నప్పటికీ ఎందుకు పేదలకు సీట్లు ఇవ్వడం లేదని కార్పొరేటర్లు మండిపడ్డారు. పేద విద్యార్థులకు రాయితీతో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

చైతన్య గ్రామీణ గోదావరి బ్యాంకు సేవలు భేష్

కొరిటిపాడు: చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ 2023-24 వార్షిక నివేదికను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శనివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ కె. ప్రమోద్‌కుమార్‌రెడ్డి, బ్యాంకు అధికారుల సమక్షంలో కలెక్టర్ నాగలక్ష్మి బ్యాంక్ బోర్డు డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎనిమిది జిల్లాల్లోని 265 శాఖల ద్వారా 29.50 లక్షల మంది ఖాతాదారులకు బ్యాంక్ సేవలందిస్తున్నట్లు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరానికి రూ. 21,444 కోట్ల వ్యాపారంతో అత్యుత్తమ ఫలితాలు సాధించిన బ్యాంకు నిర్వహణాధికారులు, సిబ్బందికి, ఖాతాదారులకు అభినందనలు తెలిపారు. బ్యాంక్ చైర్మన్ కె. ప్రమోద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తమ పనితీరుపై కస్టమర్లు ఉంచిన నమ్మకానికి ఈ ఫలితాలు నిదర్శనమని పేర్కొన్నారు.



వార్షిక నివేదిక ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి తదితరులు

ప్లీజ్ సర్.. వర్షంలో పెన్షన్లు ఇవ్వలేను !

- నా లైఫ్ మిస్సయ్యేది
- డ్రైనేజీలో పడిన సచివాలయ ఉద్యోగిని వేడుకోలు

తెనాలి: కుండపోత వర్షంలోనూ పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు ఓ సచివాలయ ఉద్యోగిని మృత్యువు వరకు తీసుకెళ్లాయి. ఎవరో చేయి పట్టి లాగకపోతే తన ప్రాణాలు పోయేవి... దుస్తులు, పింఛన్ల డబ్బులన్నీ తడిచిపోయాయి. పింఛన్లు పంపిణీ చేయలేను...కన్సిడర్ చేయమంటూ ఆ ఉద్యోగిని సంబంధిత గ్రూపులో పెట్టుకున్న ఆడియో వినతి వివరాలిలా ఉన్నాయి.సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే ఆగస్టు 31నే పింఛన్ల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చిన విషయం తెలిసిందే. శనివారం ఉదయం నుంచి కుండపోత వర్షం కురుస్తుండటంతో ప్రభుత్వ ఆదేశాలను తూచా తప్పకుండా సచివాలయ ఉద్యోగులు పాటించారు. ఆ క్రమంలోనే పట్టణ 10వ సచివాలయం లక్ష్మీనగర్‌కు చెందిన వెల్ఫేర్ అసిస్టెంట్ రమ్యకృష్ణ పింఛన్ల పంపిణీ చేస్తున్నారు. ఆ క్రమంలో బుర్రిపాలెం రోడ్డులో వెళుతుండగా, పంట కాల్వలను తలపిస్తున్న ఆ రోడ్డులో అనుకోకుండా డ్రెయినేజీలో పడిపోయారు. వర్షం కారణంగా ఆ సమయంలో రోడ్డుపై జనం లేరు. అక్కడికి దగ్గర్లోని వాహనాల సర్వీస్ సెంటర్లో ఉన్న ఓ వ్యక్తి దీన్ని గమనించాడు. హుటాహుటిన వచ్చి ఆమె చేయి పట్టి బయటకు లాగడంతో ప్రాణం నిలిచింది. దుస్తులతోపాటు పింఛన్ల పంపిణీకి తెచ్చుకున్న బ్యాగ్, అందులోని నోట్ల కట్టలు తడిచిపోయాయి. అప్పటికే జ్వరంతో ఉన్న తాను, డ్రెయినేజీలో పడిపోయానని, ఆ వ్యక్తి చూడకుంటే తన ప్రాణం ఉండేది కాదని, పింఛన్లు పంపిణీ చేయలేనని, దయ చేసి తన అభ్యర్థనను మన్నించమని కోరుతూ ఆడియో వాయిస్‌ను సంబంధిత గ్రూపులో పోస్టు చేశారామె!



తడిచిపోయిన నోట్ల కట్టలు

విజ్ఞాన్-న్యూకాన్ ఏరోస్పేస్‌ల మధ్య ఒప్పందం

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ - హైదరాబాద్‌లోని న్యూకాన్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎన్ఏపీఎల్) మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని వైస్ చాన్స్‌లర్ పి. నాగభూషణ్ శనివారం తెలిపారు. ఎన్ఏపీఎల్ ఆర్ అండ్ డీ జనరల్ మేనేజర్ జేఎల్‌పీ తిలక్‌తో ఆయన అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాల్ని మార్చుకున్నారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వల్ల ఏరో స్పేస్ ఇంజినీరింగ్, డిఫెన్స్ టెక్నాలజీ రంగాల్లో ఉమ్మడిగా పరిశోధనలతో పాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను సులభతరం చేయవచ్చని తెలిపారు. ప్రస్తుతం పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడం, వాటికి వినూత్న పరిష్కారాల్ని అభివృద్ధి చేయడంలో ఉమ్మడిగా కృషి చేస్తామని వివరించారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడం, ప్రాక్టికల్ ఇండస్ట్రీ అనుభవాన్ని అందించడంతో పాటు వృత్తిపరమైన వృద్ధిని పెంపొందిస్తామని చెప్పారు. ఎన్ఏపీఎల్ ఆర్ అండ్ డీ జనరల్ మేనేజర్ జేఎల్‌పీ తిలక్ మాట్లాడుతూ విద్యార్థులను సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాలలో తర్ఫీదునివ్వడమే ఈ ఒప్పందం లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎం.ఎస్. రఘునాథన్ పాల్గొన్నారు.



తిలక్‌తో పత్రాలను మార్చుకుంటున్న వైస్ చాన్స్‌లర్